సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం | 6 | జూలై | 2024



జయహో జగన్నాథా !

ద్వారకాతిరుమల చినవెంకన్న దత్తత ఆలయం లక్ష్మీపురం జగన్నాథుడి ఆలయంలో ఈనెల 7 నుంచి రథోత్సవాలు నిర్వహించనున్నారు. 8లో ▸



ఆలోచింపజేసిన నాటికలు

ఏలూరులో హిందూ యువజన సంఘం, హేలాపురి కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నాటిక పోటీలు ఆలోచింపజేస్తున్నాయి. 8లో ▸

పరిమళించిన మానవత్వం

ఉమ్మడి పశ్చిమలో ఊరూరా 'మానవత' సంస్థ సేవలందిస్తోంది. ఫ్రీజర్లు, శాంతి రథాలు, అంబులెన్సుల ద్వారా పేదలకు బాసటగా నిలుస్తోంది. 8లో

విద్యుత్ సంస్థలో పైరవీల జోరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వివిధ ప్రభుత్వ శాఖల్లో బదిలీలపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. దీనిలో తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఏలూరు ఆపరేషన్ సర్కిల్‌లో ఊహాగానాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటివరకూ వివిధ హోదాల్లో పనిచేసిన అధికారులను వైఎస్సార్‌సీపీ అనుకూలురుగా, సానుభూతిపరులుగా ముద్ర వేసి వారికి స్థానచలనం కలిగించే దిశగా ప్రజాప్రతినిధులు ఆలోచిస్తున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్‌తో పాటు కీలకమైన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (టెక్నికల్), సీనియర్ అక్కౌంట్స్ అధికారితో సహా కింది స్థాయి అధికారులు, సిబ్బంది కూడా త్వరలోనే బదిలీ కానున్నారని అంటున్నారు. తొలుత సంస్థ సీఎండీని మార్చే పనిలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తుండగా కొత్తగా వచ్చే సీఎండీకి ఆయా ప్రాంతాల్లో తమకు అనుకూలంగా పనిచేసే అధికారుల జాబితాను అందించేందుకు నియోజవర్గాల ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం.

- ఉద్యోగుల బదిలీలపై ఊహాగానాలు
- ప్రజాప్రతినిధుల ప్రాపకం కోసం పాకులాట
- ఎవరి దారిలో వారు ప్రయత్నాలు
- ఇప్పటికే పలువురు అధికారుల స్థానచలనం



ఏలూరులో విద్యుత్ భవనం

ఎమ్మెల్యేల ద్వారా సిఫార్సులు!

పెద్దగా 'ఆదాయం' లేని స్థానాల్లో పనిచేస్తున్న టీడీపీ సానుభూతిపరులు, చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన అధికారులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి ఆశలకు రెక్కలు వచ్చాయి. ఆదాయం వచ్చే స్థానాలకు వెళ్లాలనే కోరిక వారిలో బలంగా కనిపిస్తోంది. కొంతమంది ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు నేరుగా ఎమ్మెల్యేలతో సత్సంబంధాలు ఉండగా.. మరికొందరు ఎమ్మెల్యేలకు అత్యంత సన్నిహితులుగా ఉన్న తమ బంధువర్గాలు, మిత్రవర్గాల ద్వారా పైరవీలు చేస్తున్నారు. వీరంతా ఎమ్మెల్యేలను ఇప్పటికే కలిసి తమకు కావాల్సిన స్థానాలకు సిఫార్సు చేయాలని కోరినట్టు సమాచారం. కాగా జనసేన ఎమ్మెల్యేలు ఉన్న చోట్ల స్థానాలకు సైతం టీడీపీ నాయకులతోనే సిఫార్సు చేయించుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్టు సర్కిల్‌లో వినిపిస్తోంది. అయితే జనసేన ఎమ్మెల్యేలు మాత్రం తమ ప్రాంతాల విషయంలో కలుగజేసుకోవద్దని హెచ్చరించినట్టు తెలిసింది.

అనుకూల స్థానాల కోసం ముమ్మర ప్రయత్నాలు

జిల్లాల పునర్విభజనలో భాగంగా అన్ని శాఖలు విభజితమైనా విద్యుత్ సంస్థలో మాత్రం విభజన జరగలేదు. దీంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రాతిపదికగానే ఏలూరు ఆపరేషన్ సర్కిల్ కార్యకలాపాలు జరుగుతున్నాయి. జిల్లాస్థాయి ఉన్నతాధికారుల పరిధి ఎక్కువగా ఉండటంతో వారి ఆదాయ వనరులు ఎక్కువగానే ఉన్నాయని ఆయా వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏలూరు సర్కిల్ సూపరింటెండెంట్ పోస్టుకు విశాఖ కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఓ అధికారి ప్రయత్నాలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

- ఎస్ఈ తర్వాత స్థానమైన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (టెక్నికల్)కి ఈసారి పోటీ ఎక్కువగానే ఉందట. ప్రస్తుతం ఏలూరు ఈఈ టెక్నికల్‌గా పనిచేస్తున్న మహిళా అధికారి తాను సంస్థలో ప్రవేశించిన నాటి నుంచి ఏలూరు సర్కిల్‌లోనే పనిచేస్తున్నందున ఆమెకు ఈసారి బదిలీ తప్పదని చెబుతున్నారు. ఆమె భర్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అదనపు ఎస్పీగా పనిచేస్తున్నందున ఆమె స్పౌజ్ కోటాలో రాజమండ్రి సర్కిల్‌కు వెళ్లడానికి సిద్ధంగానే ఉన్నట్టు చెబుతున్నారు.
- రాజమండ్రి సర్కిల్‌లో ఈఈ టెక్నికల్‌గా పనిచేస్తున్న ఓ మహిళా అధికారి భర్త ఏలూరు సర్కిల్‌లో ఏఏఓగా పనిచేస్తున్నందున ఆమె కూడా ఏలూరు సర్కిల్‌కు రావడానికి సానుకూలంగానే ఉన్నట్లు తెలిసింది.
- జిల్లాస్థాయి అధికారి సీనియర్ అక్కౌంట్స్ ఆఫీసర్ కూడా ఏలూరు సర్కిల్‌లోనే వివిధ హోదాల్లో దాదాపు 20 ఏళ్లుగా పనిచేస్తున్నందున ఆయనకూ బదిలీ తప్పదని భావిస్తున్నారు.
- ఏలూరు ఈఈ స్థానానికి రాజమండ్రిలో ఈఈగా పనిచేస్తున్న ఓ అధికారితో పాటు రాజమండ్రిలో పనిచేస్తున్న ఏలూరుకి చెందిన, ఏలూరు సర్కిల్‌లో వివిధ డివిజన్లలో పనిచేసిన మరో అధికారి ప్రయత్నిస్తున్నట్టు చెబుతున్నారు.
- తాడేపల్లిగూడెం ఈఈ స్థానానికి పోటీ ఎక్కువగా ఉంది. ఇక్కడకు విజయవాడలో లోడ్ డిస్పాచ్ సెంటర్‌లో పనిచేస్తున్న ఓ అధికారి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని, ఆయనతో పాటు ఏలూరు ఈఈ, నిడదవోలు ఈఈ కూడా ఈ స్థానానికి పోటీపడుతున్నట్టు తెలిసింది.
- భీమవరం ఈఈ స్థానానికి కూడా పోటీ ఎక్కువగానే ఉందని, ఇక్కడకు నరసాపురం, విశాఖ, తాడేపల్లిగూడెంలో పనిచేస్తున్న ఈఈలు ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రచారం జోరుగా సాగుతోంది.
- నిడదవోలు ఈఈ స్థానానికి భీమవరం, ఏలూరు ట్రాన్స్‌ఫార్మర్స్ ఈఈలు, తాడేపల్లిగూడెం ఈఈ ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

వైద్యారోగ్య సిబ్బంది సమస్యలపై వినతి



స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబుకు వినతిపత్రం అందిస్తున్న ఏపీ ఎన్జీవోస్ నాయకులు

ఏలూరు (టూటౌన్): వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ ఎన్జీవోస్ నాయకులు శుక్రవారం ఏపీ సచివాలయం స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబుకు వినతిపత్రం అందజేశారు. వివరాలను ఏపీ ఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి, వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల సంఘం నాయకులు నెరుసు రామారావు శుక్రవారం సాయంత్రం ఏలూరులో వెల్లడించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల ప్రధాన సమస్య అయిన వంద శాతం గ్రాస్ శాలరీ, జీఎన్ఎం గ్రేడ్–3 ప్రమోషన్లు, జీఎన్ఎం ట్రెనింగ్ అవుతున్న వారికి జీఎన్ఎంగా ప్రమోషన్ ఇవ్వాలని కోరామన్నారు. ఏఎస్ఓ నుంచి డీఎస్ఓగా పదోన్నతి, స్టాఫ్ నర్స్ ప్రమోషన్స్ తదితర అంశాలపై చర్చించినట్టు చెప్పారు. వీటిపై తగు చర్యలు తీసుకుంటామని స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు హామీ ఇచ్చారన్నారు. కృష్ణబాబును కలిసిన వారిలో ఏపీ ఎన్జీవోస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, తాడేపల్లిగూడెం తాలూకా ఉపాధ్యక్షులు సురేష్, మహీధర్, సుధీర్ తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

కార్తీక్‌కు అంతర్జాతీయ చెస్ రేటింగ్



కార్తీక్‌ను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఇటీవల భీమవరంలో జరిగిన ఇంటర్నేషనల్ ఓపెన్ చెస్ రేటింగ్ టోర్నమెంట్‌లో అనసూయ చెస్ అకాడమీ విద్యార్థి శివసాయి కార్తీక్ ప్రతిభ చూపాడు. ప్రపంచ చెస్ సమాఖ్య విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో 1496 రేటింగ్ పాయింట్స్ సాధించాడు. గతంలో ర్యాపిడ్ విభాగంలోనూ రేటింగ్ సాధించాడు. కార్తీక్ చినఅమిరం జెడ్పీ హైస్కూల్‌లో టెన్త్ చదువుతున్నాడు.

'కియా'లో ఉద్యోగావకాశాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డిప్లొమా, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కియా ఇండియా సంస్థలో ట్రైనింగ్, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 2019–2024లో డిప్లొమా, బీటెక్‌లో ఉత్తీర్ణత సాధించిన 18–25 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.15,500 ఉపకార వేతనం ఉంటుందన్నారు. అనంతపురం జిల్లా పెనుగొండలోని కియా ఇండియాలో ఐదు రోజుల శిక్షణ అనంతరం ట్రైనీలుగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు కియా ప్రాజెక్టు కో–ఆర్డినేటర్‌ను సెల్ 76589 02296లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): రహదారుల నిబంధనలపై యువతకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని కలెక్టర్ సి.నాగరాణి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో రహదారుల భద్రతా అంశాలపై రవాణా శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారి భద్రతపై దృష్టి సారించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, హైవేలపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలపడం ప్రమాదాలకు కారణం అవుతున్నాయన్నారు. నిర్దేశిత ప్రాంతాల్లో మాత్రమే వాహనాలు నిలిపేలా పర్యవేక్షించాలన్నారు. స్కూల్ బస్సుల సామర్థ్య తనిఖీలను ఎప్పటికప్పుడు చేయాలని, డ్రైవర్ల వివరాలను సేకరించాలని సూచించారు. జిల్లాలోని కళాశాలల్లో రహదారుల భద్రతా నిబంధనలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమా మహేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కేఎస్ఎన్ ప్రసాద్, డీఎస్ఎస్ నాయక్, ఎం.వెంకటేశ్వరరావు, ఏఎంవీఐలు రవికుమార్, సుబ్బలక్ష్మి సత్యనారాయణ పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి

ఏలూరు (టూటౌన్): ద్విచక్ర వాహనదారులంతా రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటిస్తూ హెల్మెట్‌ను ధరించి ప్రయాణం చేయాలన్నారు. ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు భద్రత మార్గదర్శకాలను తప్పక పాటించాలన్నారు. ఆర్టీఓ కె.శ్రీహరి మాట్లాడుతూ వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి ఉండాలన్నారు. అతివేగం ప్రమాదకరమన్నారు.

చిన్న నిర్మాతలను ప్రోత్సహించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే చిన్న సినిమాల నిర్మాణం పెరగాల్సి ఉందని, ఈ దిశగా ప్రభుత్వం రాయితీలు ప్రకటించాలని సినీ నటుడు సుమన్ అన్నారు. ఏలూరులో జరుగుతున్న ఓ సినిమా షూటింగ్‌లో పాల్గొన్న ఆయన శుక్రవారం విరామ సమయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే బాలకృష్ణ కృషిచేయాలని కోరారు. ఏపీలో తెలంగాణలో కంటే అద్భుతమైన లొకేషన్లు ఉన్నాయన్నారు. ఏలూరులో షూటింగ్ చేస్తున్న సినిమాలో వివాహ బంధం గొప్పదనాన్ని వివరించే జడ్జి పాత్రలో తాను నటిస్తున్నానన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగిరపర్చాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పీఎంఏవై, టిడ్కో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలో గృహ నిర్మాణాలపై సమీక్షించారు. పీఎంఏవై కింద ఇళ్ల నిర్మాణాల్లో రాష్ట్రంలో జిల్లా 64 శాతం ప్రగతితో మూడో స్థానంలో, పీఎంఏవై గ్రామీణ్ కింద 55 శాతం ప్రగతితో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఇదే ఒరవడితో ముందుకు సాగాలన్నారు. అలాగే జిల్లాకు మొత్తం 21,424 టిడ్కో ఇళ్లు మంజూరయ్యాయని, భీమవరంలో 2,944, తాడేపల్లిగూడెంలో 3,232, పాలకొల్లులో 2,560 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. అలాగే భీమవరంలో 5,408, తాడేపల్లిగూడెంలో 2,144, పాలకొల్లులో 3,584 మొత్తంగా 11,136 ఇళ్ల నిర్మాణాలు 90 శాతానికి పైగా పూర్తయ్యాయన్నారు. రెండో విడతలో తణుకులో 912 ఇళ్లు మంజూరు కాగా నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. త్వరితగతిన ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు కృషిచేస్తున్నామని ఆమె అన్నారు.

హౌసింగ్ డే వేడుకలు

జిల్లా గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో 46వ హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. సమష్టిగా నాణ్యమైన గృహనిర్మాణాలు కృషిచేయాలని కోరారు. ఇన్‌చార్జి హౌసింగ్ అధికారి జి.పిచ్చయ్య, ఈఈ బి.వెంకట రమణ, పీఎస్ వేణుగోపాల్, డీఈలు ఎన్‌వీఎస్ గోపాల్‌రాజు, ఆర్.త్రిమూర్తులు, పి.వెంకటేశ్వరరావు, పి.శివరామరాజు, వరప్రసాద్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డి.రామకృష్ణ, ఏఈలు పాల్గొన్నారు.

సాంకేతికతల నెలవు కేవీకేలు



వెంకట్రామన్నగూడెం కేవీకేలో స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

తాడేపల్లిగూడెం: సాంకేతికతల నెలవు కృషి విజ్ఞాన కేంద్రాలని (కేవీకే) జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. కేవీకేల స్వర్ణోత్సవాల సందర్భంగా శుక్రవారం వెంకట్రామన్నగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కేవీకేల ద్వారా రైతులకు ఉద్యాన విభాగంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు సాంకేతిక సాయం అందుతుందన్నారు. దీని ద్వారా రైతుల ఆదాయాలు పెంచేందుకు ప్రయోజనంగా ఉందన్నారు. వ్యవసాయ రంగానికి కేవీకేల సేవలు ఎనలేనివన్నారు. ఉద్యాన వర్సిటీ పరిశోధన సంచాలకుడు ఎల్.నారం నాయుడు మాట్లాడుతూ కేవీకేల ద్వారా డ్రోన్ల ప్రదర్శన, సహజ వ్యవసాయ పద్ధతులు, సమగ్ర వ్యవసాయ విధానాల గురించి వివరించి రైతులను చైతన్యవంతులను చేస్తున్నారన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విస్తరణ సంచాలకులు ఈ.కరుణశ్రీ మాట్లాడుతూ కేవీకే ద్వారా నూతన వరివంగడాల పరిచయం, ఉద్యాన పంటల్లో మిరప, ఆయిల్‌పామ్, కొబ్బరి, కూరగాయల పంటల్లో సమగ్రపోషక యాజమాన్యంపై శిక్షణలు ఇవ్వనున్నామన్నారు. కేవీకేల పురోగతికి స్వర్ణోత్సవ జ్యోతి చిహ్నమన్నారు. సహజ వ్యవసాయం, ఉద్యాన అనుబంధ రంగాల్లో సాంకేతికత, వినూత్న పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చామన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు ఎం.రాఘవేంద్రరెడ్డి, కె.వెంకట సతీష్, వి.దీప్తి, దేవీవరప్రసాదరెడ్డి, ద్వారకాతిరుమల, నల్లజర్ల వ్యవసాయాధికారులు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల రైతులు పాల్గొన్నారు.

మురుగు నివారణకు చర్యలు



డ్రెయినేజీ ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

పాలకోడేరు: పాలకోడేరు మండలం మోగల్లులోని దళితవాడలో మురుగు సమస్యకు మోక్షం కలిగింది. 'రహదారిపైనే మురుగు నీరు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డుకిరువైపులా ఆక్రమించి ఇళ్లు నిర్మించడమే సమస్యకు కారణమని డీపీఓ విక్టర్, ఈవోపీఆర్డీ ఆంజనేయులు, శానిటేషన్ అధికారి ఎడ్వర్డ్ గుర్తించారు. పొక్లయిన్‌తో రోడ్డుకిరువైపులా ఆక్రమణలు తొలగించి డ్రెయినేజీకి విముక్తి కలిగించారు. ఏళ్లనాటి సమస్య పరిష్కారం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌హెచ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో కొనసాగుతున్న జాతీయ రహదారుల (ఎన్‌హెచ్) ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోనేషనల్ హైవేస్ అధికారులతో ఆమె సమావేశమై ఎన్‌హెచ్ 165, ఎన్‌హెచ్ 216 ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పామర్రు నుంచి ఆకివీడు మీదుగా దిగమర్రు వరకు ఎన్‌హెచ్ నిర్మాణం చేపట్టారన్నారు. పామర్రు నుంచి ఆకివీడు వరకు 64 కిలోమీటర్ల పరిధిలో నిర్మాణ పనులు సాగుతున్నాయని, ఆకివీడు నుంచి భీమవరం మీదుగా దిగమర్రు వరకు 40 కిలోమీటర్ల రహదారిలో 17 కిలోమీటర్ల పరిధిలో పనులు చేపట్టాల్సిందన్నారు. ఇందు కోసం భీమవరం బైపాస్ ప్రాంతంలోని ఆరు కిలోమీటర్ల పరిధిలో భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ఆర్డీఓకు సూచించారు. అలాగే కత్తిపూడి నుంచి ఒంగోలు ఎన్‌హెచ్–216 మార్గ మధ్యలో మండలం కాళీపట్నం వద్ద సీపేజ్ అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణ, ఎన్‌హెచ్ ఈఈ సంజీవ రాయుడు, ఎన్‌హెచ్ సబ్ డివిజన్ డిప్యూటీ ఈఈ ఎల్ఎస్ సుబ్రహ్మణ్యం, మోర్త్ సహాయం ఇంజనీర్లు పాల్గొన్నారు.

అంకిత భావంతో సేవలందించాలి

మూగజీవాలకు అందించే సేవల్లో లోపాలు ఉండరాదని కలెక్టర్ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధక శాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. అంకిత భావంతో మూగజీవాలకు సేవలందించాలన్నారు. జిల్లాలో 2,23,676 ఆవులు, గేదెలు, 61,569 గొర్రెలు, 43,04,397 మేకలు, పందులు, బాతులు, నాటు కోళ్లు, బాయిలర్, ఫారం కోళ్లు ఉన్నాయన్నారు. జిల్లాలో వెటర్నరీ ఇనిస్టిట్యూషన్స్ 318 ఉన్నాయని తెలిపారు. 31 కేంద్రాల్లో టాయిలెట్స్ అవసరం ఉన్నాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చాలా ఆస్పత్రులు మరమ్మతులు దశలో ఉన్నాయని తెలపగా నిధుల మంజూరుకు కృషిచేస్తామని ఆమె అన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.కె మురళీకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్లు డా.జవహర్ హుస్సేన్, ఎల్‌కే సుధాకర్, జి.జేసురత్నం, టెక్నికల్ అధికారి నోయల్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలాన్ని ఏపీలో కలపాలి



మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర విభజనలో భాగంగా ఆంధ్రాకు దక్కాల్సిన వాటాలన్నీ సక్రమంగా వచ్చేలా ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల చర్చలు జరపాలని ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పాలకొల్లులో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాటి విభజనలో సరైన ప్రక్రియ జరగకపోవడం వల్ల ప్రతి ప్రాజెక్టులో వివాదాలు వచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. 233 సంస్థలపై వివాదాలు పరిష్కారం కావాల్సి ఉందని, మరో 12 సంస్థలపై చర్చ జరగాల్సి ఉందన్నారు. 91 శాతం సంస్థలు తెలంగాణలో ఉండగా 9 శాతం మాత్రమే ఆంధ్రాలో ఉన్నాయన్నారు. విభజన హామీలు సక్రమంగా వివాదాలు లేకుండా జరగాలన్నారు. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని, నాడు భద్రాచలంతో పాటు మరో నాలుగు మండలాలు ఆంధ్రప్రదేశ్ తూర్పుగోదావరి జిల్లాలో ఉన్నాయని, వాటిని అలాగే ఏపీలో ఉండేలా ముఖ్యమంత్రులు ఇద్దరూ చర్చల్లో నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆర్థికంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఇండస్ట్రీయల్ ఏపీగా ముందుకు తీసుకువెళ్లాలన్నారు. పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలని కోరారు. దేశంలో పాలిస్తోంది మోదీ ప్రభుత్వం కాదని, అదానీ ప్రభుత్వమని చలసాని విమర్శించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ఇనుప గనులను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ కేఎస్‌పీఎస్ వర్మ, పడాల రామాంజనేయులు, మేడికొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన గోదారమ్మ



గలగలా గోదావరి.. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి

పోలవరం రూరల్: గోదారమ్మ ఎరుపెక్కింది. ఈ ఏడాదిలో తొలిసారిగా రంగు మారి ప్రవహిస్తోంది. నదీ పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పాటు కొండవాగుల నీరు చేరడంతో రంగు మారింది. ఇదిలా ఉండగా గోదావరి వరద క్రమేపీ పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 26.500 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. ఎగువ నుంచి వచ్చిన నీరు వచ్చినట్టుగా 48 గేట్ల నుంచి దిగువకు చేరుతోంది. దీంతో ప్రాజెక్టు దిగువ భాగాన ఇసుక తిన్నెలను ముంచుకుంటూ వరద ప్రవహిస్తోంది.

రహదారి మరమ్మతులకు ఆదేశం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారుల ప్యాచ్ వర్కులను వెంటనే చేపట్టి ప్రమాదాలను నివారించాలని కలెక్టర్ సి.నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. రహదారుల్లో గుంతలను వెంటనే పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణంలో ఉన్న రహదారులను వేగంగా పూర్తి చేయాలని, అలాగే కల్వర్టుల మరమ్మతులపై శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో అత్యవసరంగా చేపట్టాల్సిన రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులకు ప్రతిపాదనలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారి ఎల్.లోకేశ్వరరావు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

పింఛన్లపై టీడీపీ ఫిర్యాదులు

రాజకీయ కక్షతో అడ్డుకుంటున్న వైనం

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పేదల పింఛన్లపై కన్నేశారు. మండలంలో సుమారు వెయ్యికు పైగా పింఛన్లు తొలగించాలని ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. గతవారం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి.. మండల టీడీపీ నాయకులు నేతల రవి, టీడీపీ మండలాధ్యక్షుడు నంబూరి నాగరాజు, శ్రీపర్రు గ్రామానికి చెందిన శ్రీహరి, గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు తదితర గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు ఎంపీడీఓ బి.ప్రణవితో సమావేశమయ్యారు. ఆయా గ్రామాల వారీగా పింఛన్ లబ్ధిదారుల చిట్టా తీసుకువచ్చారు. గత ప్రభుత్వ హయాంలో తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి పింఛన్లు పొందారంటూ ఆరోపిస్తూ గ్రామాల వారీగా పలువురు లబ్ధిదారుల పేర్లు వివరించి విచారణ చేపట్టాలని కోరారు. విచారణలో టీడీపీ నాయకులు సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ ప్రణవి ఫిర్యాదు లేకుండా పింఛన్ల తొలగింపు, విచారణ చేపట్టలేమన్నారు. దీంతో పింఛన్ల పంపిణీ రోజు ఫిర్యాదు చేస్తామని పలువురు చెప్పారు. ఈ నేపథ్యంలో ఈనెల 1న పాలగూడెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గోఖనేషు కుమార్తె, మానసిక దివ్యాంగురాలు మార్తమ్మ పింఛన్‌ను ఎంపీడీఓ నిలిపివేశారు. దీనిపై ప్రశ్నించగా టీడీపీ మండలాధ్యక్షుడు నాగరాజు ఫిర్యాదు చేశారంటూ ఎంపీడీఓ తెలిపారు. టీడీపీ నేతలు రాజకీయ కక్షతోనే పింఛన్లు నిలిపివేయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా

నర్సు ఆత్మహత్యాయత్నం



తాడేపల్లిగూడెం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో మమతకు చికిత్స చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న బాదంపూడి మమత (22) ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడదవోలుకు చెందిన మమత తాడేపల్లిగూడెంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో గత రెండేళ్లుగా నర్సుగా పనిచేస్తోంది. ఆమెకు రాజేష్‌తో పరిచయం కాగా పెళ్లి చేసుకునేందుకు నిర్ణయించుకున్నారు. అయితే రాజేష్‌కు మరో యువతితో వివాహమైందని తెలిసి అతనిని నిలదీసింది. తనను పెళ్లిచేసుకోవాలని కోరగా.. రాజేష్ నిరాకరించడంతో ఆసుపత్రి సమీపంలో ఉన్న రెస్ట్ రూమ్‌లో ఫ్యాన్‌కు చున్నితో ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న సహచర సిబ్బంది ఆమెను రక్షించి వైద్య సేవలు అందించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించారు. సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ పోలీసులు తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ రూ.45 లక్షల మోసం



నిందితుడి అరెస్టు చూపుతున్న వరంగల్ సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్‌కుమార్

వరంగల్ క్రైం: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయాలు వసూలు చేసిన సైబర్ నేరస్తుడిని వరంగల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిట్యాపూర్‌కు చెందిన పానగంటి సాయితేజ ఎంబీఏ చదివి కొన్ని కంపెనీల్లో పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. అదే సమయంలో జల్సాలకు అలవాటు పడడంతో డబ్బు కోసం మోసాలకు దిగాడు. ఉద్యోగాలు కల్పించే కొన్ని వెబ్ సైట్లను వేదికగా చేసుకున్నాడు. బ్యాక్ డోర్ ద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని సమాచారం పంపించేవాడు. ఆ మేసేజ్‌లకు స్పందించిన నిరుద్యోగుల నుంచి ఇంటర్వ్యూ, పరీక్షలు, ట్రైనింగ్ కోసం రూ.లక్షల్లో వసూళ్లు చేసేవాడు. హనుమకొండ ప్రాంతంలోని ఓ నిరుద్యోగి నుంచి సుమారు రూ.3 లక్షలకుపైగా వసూలు చేశాడు. సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించారు.

పరిమళించిన మానవత్వం

- ఉమ్మడి పశ్చిమలో ఊరూరా 'మానవత' సంస్థ సేవలు
- ఫ్రీజర్లు, శాంతిరథాలు, అంబులెన్సుల ఏర్పాటు



కైకలూరు శివారు దత్తాశ్రమంలో మానవత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం(ఫైల్)



భీమడోలు మండలం అర్జవానిగూడెంలో అగ్ని ప్రమాదం బాధితులకు సాయం(ఫైల్)

కైకలూరు: ఒక చిన్న ఆలోచన వేలాది మంది పేదలకు బాసటగా నిలిచింది. తాను నాటిన విత్తు ఇంత పెద్ద వృక్షమై అందరికీ నీడనిస్తుందని ఎస్.రామచంద్రారెడ్డి ఊహించ ఉండదు. పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఆయనది వైఎస్సార్ కడప జిల్లా బండపల్లి గ్రామం. 2004లో కేవలం 108 మంది సభ్యులతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించారు. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, ప్రమాదాల సమయంలో ప్రాణరక్షణ, నైతిక విలువల బోధన, పర్యావరణ పరిరక్షణ అంశాలలో చేసిన సేవ ఎంతో మందిలో స్ఫూర్తిని నింపింది.

108 మంది సభ్యులతో స్థాపించిన సంస్థలో ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా 70,000 మంది సభ్యులున్నారు. ఏపీలో 115 మండలాల్లో సంస్థ సేవలు అందిస్తోంది. మృతదేహాలను భద్రపరిచే 625 ఫ్రీజర్ బాక్సులు, శ్మశాన వాటికలకు తరలించడానికి 70 శాంతిరథాలు, అత్యవసర వైద్య సేవలు అందించడానికి 10 అంబులెన్సులు, ప్రజల దాహార్తి తీర్చడానికి 17 వాటర్ ట్యాంకులు సంస్థ తరఫున అందించారు. దాతల సాయంతో పూర్తి పారదర్శకంగా సేవలు అందించడంతో అనేక మంది సభ్యులుగా చేరుతున్నారు.

పశ్చిమతో ప్రత్యేకానుబంధం..

జంగారెడ్డిగూడెంలో సంస్థ ప్రారంభం కావడంతో సమీప మండలాల్లో ఆ ప్రభావం ఎక్కువగా ఉంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కొయ్యలగూడెం, కామవరపుకోట, చింతలపూడి, దేవరపల్లి, గోపాలపురం, తాళ్ళపూడి, భీమడోలు, నల్లజర్ల, ద్వారకాతిరుమల, దెందులూరు, పెదవేగి, ఏలూరు, పెదపాడు, తడికలపూడి, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు. పెంటపాడు, గణపవరం, నిడమర్రు, ఉండి, తణుకు, ఉండ్రాజవరం, నిడదవోలు, అత్తిలి, పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట, పాలకొల్లు, కలిదిండి, కైకలూరు, నూజివీడు, భీమవరంలో సంస్థ సేవలందిస్తోంది. ఈ జిల్లాల్లో మొత్తం 17,000 మంది సభ్యులు ఉండగా, అత్యధికంగా జిల్లా ప్రధాన కేంద్రమైన ఏలూరులో 2000కు పైగా సభ్యులు సేవలందిస్తోన్నారు. జిల్లా, మండల స్థాయి కమిటీలతో పాటు ప్రతి జిల్లాకు 9 రీజియన్‌లు మించకుండా చైర్మన్, కో–చైర్మన్, కన్వీనర్లు ఉంటారు. కేంద్ర నియంత్రణ కమిటీ పర్యవేక్షణ చేస్తోంది.

మానవత సంస్థ ఆశయాలు ఇవి

- విద్యార్థులు జీవితంలో స్థిరపడడానికి కెరీర్ గైడెన్స్, నైతిక విలువ బోధన
- పర్యావరణ పరిరక్షణ, ప్రమాద నివారణ చర్యలు, భయంకర వ్యాధులపై ప్రజలకు చైతన్య, ఉపనిషత్తులు, ధర్మాల బోధన.
- ప్రమాద సమయంలో ప్రాణరక్షణ, రక్తదాన నిధి ఏర్పాటు..
- పేద విద్యార్థులు, రోగగ్రస్తులు, అనాథులు, వికలాంగులకు సేవలు
- మార్చురీ ఫ్రీజర్, శాంతిరథాలు, అంబులెన్సులు, వాటర్ ట్యాంకుల ద్వారా సేవలు
- సమాజంలో జాతి, కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా సేవ చేయడం
- కైకలూరులో సంస్థ ద్వారా చేసిన సేవలు.
- కైకలూరులో 2023లో కొండ్రెడ్డి వెంకట సత్యనారాయణ అధ్యక్షుడిగా సంస్థను స్థాపించారు. ఈ ఏడాది చిట్టెమ్మ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు.
- 10వ తరగతి విద్యార్థులకు ప్రొఫెసర్ విజయ్ కుమార్‌తో ప్రత్యేక క్లాసులు
- సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యతను తెలుపుతూ అవగాహన కార్యక్రమం
- ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఆర్థికసాయం, సైకిళ్ల పంపిణీ
- ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని జనపనార బ్యాగుల పంపిణీ
- ఉచిత వైద్యశిబిరాలు, వేసవిలో ఉచిత చలివేంద్రాల ఏర్పాటు
- మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ, పాఠశాలల మౌళిక వసతులకు విరాళాలు

ఇలా కార్యక్రమాలను మానవత నిర్వహిస్తోంది.

సాయం చేయడంలో సంతృప్తి



కష్టాలలో ఉన్నవారికి చేయదగిన సహాయం ప్రతి ఒక్కరూ చేయాలి. జాతి, కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా సేవ చేయడానికి అందరూ ముందుకు రావాలి. చిన్నగా ప్రారంభించిన సంస్థ శాఖోపశాఖలుగా ఎదగడం ఆనందానిస్తోంది. ముఖ్యంగా చదువుకునే విద్యార్థులకు ప్రోత్సహం అందించాలి. సంస్థలో మరింత మంది సభ్యులుగా చేరి శాంతి సమాజ నిర్మాణానికి కృషి చేయాలి.

– ఎస్.రామచంద్రారెడ్డి, మావనత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు

జగనన్న లేఅవుట్‌లో ఆక్రమణల అడ్డగింపు



ఫెన్సింగ్ వేసేందుకు పాతిన రాళ్లు

నూజివీడు: పట్టణంలోని పేదలతో పాటు మండలంలోని రేగుంటకు చెందిన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన జగనన్న లేఅవుట్‌ను ఆక్రమిస్తుండగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. పట్టణంలోని అజరయ్యపేట, నెహ్రూపేటలకు చెందిన పేదలతో పాటు మండలంలోని యనమదల శివారు రేగుంటకు చెందిన పేదలకు రేగుంట సమీపంలోని గట్టు వద్ద రెండేళ్ల క్రితం అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. స్థలాల్లో పేదలు ఇంకా గృహాలు నిర్మించుకోలేదు. దీంతో లేఅవుట్‌కు పక్కనే ఉన్న భూమి యజమాని లే అవుట్‌లో కొంత భాగం ఆక్రమించుకోవడానికి శుక్రవారం సన్నాహాలు చేస్తున్నాడు. దీంతో జడ్పీ వైస్ చైర్మన్ గుడిమెళ్ల కృష్ణంరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కళ్లేపల్లి ఆదినారాయణ, చేబత్తిన మున్నాలు విషయాన్ని తహసీల్దార్ ఏపీ శాస్త్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తహసీల్దార్ వెంటనే జగనన్న లేఅవుట్ వద్దకు సర్వేయర్‌ను, వీఆర్వోలను పంపారు. వారితో పాటు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా వెళ్లారు. రైతు తరుపున అక్కడ ఉన్న ఆగిరిపల్లి మాజీ జెడ్పీటీసీ కాజ రాంబాబు ఉండటంతో అతనితో రెవిన్యూ సిబ్బంది మాట్లాడి ఆక్రమణను నిలువరించారు.

ఉద్యోగ భద్రత కోసం కృషిచేయాలి



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఏలూరు(మెట్రో): అప్కోస్‌లో పనిచేస్తున్న తమ క్యాడర్‌కు ఉద్యోగ భద్రత కల్పించేలా కృషి చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్‌ను పోలవరం కుడి ప్రధాన కాలువ సర్కిల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు శుక్రవారం శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఏలూరు జలవనరుల శాఖ పోలవరం కుడి ప్రధాన కాల్వ సర్కిల్‌లో సుమారు పద్దెనిమిది సంవత్సరాల నుంచి వివిధ క్యాడర్లలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నామన్నారు. చాలీచాలని జీతాలతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొన్నారు. రాబోయే పీఏసీలో తమ జీతాలను హెచ్చించి ఆప్కోస్‌లో పనిచేస్తున్న తమ కేడర్‌కు ఉద్యోగ భద్రత కల్పించేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలతో ముఖ్యమంత్రి స్థాయిలో సమావేశం ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, ఈ సందర్భంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు, వారికి హెల్త్ కార్డ్స్, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పింఛన్ సొమ్ము కాజేసిన కార్యదర్శి అరెస్ట్

పాలకొల్లు అర్బన్ : పింఛన్ సొమ్ముతో పరారైన లంకలకోడేరు సచివాలయం గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శి బి.రాముని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్సై డి.హరికృష్ణ శుక్రవారం తెలిపారు. రాము ఈ నెల 1న పింఛన్ సొమ్ములు రూ.2,50,500తో పరారైన విషయం తెలిసిందే. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి రాజేష్ ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడి డబ్బులు పోగొట్టడంతో.. వృద్ధులకు పంచడానికి సొమ్ములు లేకపోవడంతో పరారైనట్లు రాము నేరం అంగీకరించాడు. దీంతో ఎంపీడీవో రూరల్ పోలీసులకు అప్పగించారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. రాము ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసిన కారణంగా సస్పెండ్ చేయాలని ఎంపీడీవో జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేశారు.

జయహో జగన్నాథా!

- రేపటి నుంచి లక్ష్మీపురం ఆలయంలో రథోత్సవాలు
- దశావతారాల్లో దర్శనమివ్వనున్న స్వామివారు



ముస్తాబైన సుభద్ర, బలభద్ర, జగన్నాథుల దారు విగ్రహాలు



ఆలయం ముందు నిర్మించిన చలువ పందిరి



జగన్నాథుడి రథం

ద్వారకాతిరుమల: జగన్నాథ రథోత్సవాలను శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన లక్ష్మీపురం జగన్నాథుడి ఆలయంలో ఈనెల 7 నుంచి 17 వరకు వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవాల్లో భాగంగా జగన్నాథ స్వామి ఆలయ ఆవరణలోని మండపంలో రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దీన్ని పురస్కరించుకుని మండపాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఆలయం ముందు చలువ పందిరి నిర్మించారు. అలాగే ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీప తోరణాలతో అలంకరిస్తున్నారు. స్వామివారి రథయాత్రలకు వినియోగించే రథ వాహనాన్ని సిద్ధం చేస్తున్నారు. ఉత్సవాల ప్రారంభం రోజు ఆదివారం సాయంత్రం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు రథ వాహనంలో కొలువుదీరి ద్వారకాతిరుమల క్షేత్రానికి వెళ్లనున్నారు. 17న ఆలయం నుంచి సమీప గ్రామమైన తిమ్మాపురం వైపు రథయాత్ర సాగనుంది. ఉత్సవాలు జరిగే పదిరోజులు జగన్నాథుడి దశావతారాలు భక్తులను అలరించనున్నాయి.

ఆలయంలో ప్రతి ఏటా ఈ ఉత్సవాలు పదిరోజుల పాటు జరుగుతున్నాయి. ఉత్సవాల ముగింపు రోజు అంటే ఏకాదశి తిథి రోజు లక్ష్మీపురం ఆలయం నుంచి సమీప గ్రామమైన తిమ్మాపురం వరకు జరిగే రథోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయి. ఈసారి ఏకాదశి తిథి 17న రావడంతో ఉత్సవాలు ఆ రోజున ముగియనున్నాయి.

ఆలయ ప్రాముఖ్యత

ఈ ఆలయాన్ని ఒడిశా రాష్ట్రానికి చెందిన మఠాధిపతులైన మంత్రరత్నం అమ్మాజీ 130 ఏళ్ల క్రితం నిర్మించారు. జగన్నాథుడితో పాటు, వేంకటేశ్వర స్వామిని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి కల్యాణోత్సవ, పవిత్రోత్సవాలతో కైంకర్యాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

ఏ రోజు ఏ అవతారం

- 7న మత్స్యావతారం
- 8న కూర్మావతారం
- 9న వరాహావతారం
- 10న నరసింహావతారం
- 11న వామనావతారం
- 12న పరశురామావతారం
- 13న రామావతారం
- 14న కృష్ణావతారం
- 15న కల్కిఅవతారం
- 16న శ్రీ వేంకటేశ్వర స్వామి అలంకారం

శ్రీవారి సేవలో బుల్లితెర నటి సుహాసిని



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని సినీ, బుల్లితెర నటి సుహాసిని శుక్రవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆమె ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆమెకు వేద ఆశీర్వచనాన్ని, ప్రసాదాలను అందజేశారు.


చెరువులో విష ప్రయోగం



చెరువులో చనిపోయిన చేపలు పరిశీలిస్తున్న ఎస్సై వీరభద్రం

కాళ్ల: జువ్వలపాలెం గ్రామంలో కొత్తపేటలో ఉన్న పంచాయతీ వాడకం చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేయడంతో గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. గ్రామంలో పంచాయతీ చెరువులో చేపలు చనిపోయాయి. ఈ విషయంపై శుక్రవారం గ్రామ కార్యదర్శి రామరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై వీరభద్రరావు చెరువును పరిశీలించారు. గ్రామ ఉపసర్పంచ్ కటారి లక్ష్మీపతి రాజు, ఎంపీటీసీ మీసాల శ్రీనివాస్‌లతో పాటు స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మీసాల శ్రీను మాట్లాడుతూ చెరువులో విష ప్రయోగం చేసిన వారిని గుర్తించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యదర్శి మాట్లాడుతూ చెరువులో విష ప్రయోగం వల్ల సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు.

మద్యం మత్తులో దాడి.. వ్యక్తి మృతి



కామవరపుకోట : మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రావికంపాడులో జరిగింది. తడికలపూడి ఎస్సై జయబాబు వివరాల ప్రకారం మండలంలో రావికంపాడుకు చెందిన మద్దిపట్ల నాగేశ్వరరావు, వీరిశెట్టిగూడెంకు చెందిన ఆవుల ఇస్సాకు (35 సంవత్సరాలు) గురువారం రాత్రి మద్యం సేవించి రావికంపాడులోని రామాలయం ఆవరణలో పడుకున్నారు. అదే రోజు, అర్ధరాత్రి సమయంలో ఆవుల ఇస్సాకు, నాగేశ్వరరావును మధ్య సెల్‌ఫోన్ విషయమై గొడవ జరిగింది. కర్రతో ఇస్సాకుపై తలపై నాగేశ్వరరావు కొట్టాడు. గాయపడిన ఇస్సాకును జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసి నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జయబాబు తెలిపారు. నిందితుడు నాగేశ్వరరావు గతంలో భార్యను కొట్టి హతమార్చినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఆలోచింపజేసిన నాటికలు



'అజరామరం' నాటికలోని దృశ్యం



'రాత' నాటికలోని కీలక సన్నివేశం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : గతంలో సమాజానికి మార్గనిర్దేశనం చేయడంలో నాటికలు ప్రధానపాత్ర పోషించేవి. అనంతర నాటికలకు ఆదరణ కరువవడంతో ప్రదర్శనలు తగ్గుముఖం పట్టాయి. ఇటీవలి కొన్ని కళా సంస్థల చొరవతో దాతలు ముందుకు వచ్చి నాటిక పరిషత్‌లు ఏర్పాటు చేస్తూ నేటి యువతకు రంగస్థల నాటికల రచనలు, ప్రదర్శనలపై ఆసక్తి పెంచుతున్నారు. దీనిలో భాగంగానే నగరంలో గత గురువారం నుంచి హిందూ యువజన సంఘం, హేలాపురి కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి సీతారామ రాజు స్మారక రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో వివిధ కళా సంస్థలు ప్రదర్శిస్తున్న నాటికలు ప్రేక్షకులను ఆలోచింపచేస్తున్నాయి. శుక్రవారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ప్రదర్శించిన రాత, అజరామరం నాటికలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత ప్రదర్శించిన రాత నాటిక సమాజంలో ఏం జరుగుతోంది, సమాజం ఎటుపోతోంది అనే అంశాలను విమర్శనాత్మకంగా ప్రదర్శించారు. మనిషికి కష్టం కలిగితే నా రాత ఇంతే, నా రాత బాగాలేదు అని రాతపైకి నేట్టేసే మనిషి సుఖం విషయంలో మాత్రం రాతను గాలికి వదిలేస్తాడని, తాను పొందాల్సినవి మంచిగా పొందుతూ తాను ఇవ్వాల్సిన వాటి విషయంలో మాత్రం బాధ్యతా రాహిత్యంగా ఉదాసీనంగా వ్యవహరిస్తాడని అది ఎదుటి మనిషి విషయంలోనైనా, ప్రకృతి విషయంలోనైనా అలాగే వ్యవహార సరళి ఉంటుందని ఆయా పాత్రలతో దర్శక రచయిత శ్రీనివాసరావు పోలుదాసు ఆకట్టుకునే రీతిలో చెప్పించడంలో సఫలమయ్యారు. రాత్రి 8 గంటలకు ప్రారంభించిన అజరామరం నాటిక మానవుల్లోని ప్రేమ, త్యాగాలను స్పృజించింది. జెట్టి హరిబాబు రచన, దర్శకత్వంలో ప్రదర్శించిన ఈ నాటిక సృష్టిలో ప్రాణికోటి ఉద్భవించిన మరుక్షణమే ప్రేమ, త్యాగం పుట్టుకొచ్చాయని, ప్రాణకోటి తమ జీవనప్రయాణంలో గాడి తప్పినా, ప్రేమ, త్యాగం మాత్రం తమ విధులను సక్రమంగా నిర్వర్తించడం జరుగుతూనే ఉందనే అంశాన్ని చక్కగా చూపారు. కార్యక్రమంలో అతిథులుగా వైఎంహెచ్ఏ మేనేజ్‌మెంట్ కమిటీ ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి వేమా కోటేశ్వరరావు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు, వైఎంహెచ్ఏ కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి సూర్యకాంతరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోతే శ్రీనివాస నారాయణరావు హాజరయ్యారు. హేలాపురి కళాపరిషత్ సంస్థ అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు గుత్తా కొసలేంద్ర రావు, కార్యదర్శి సంకు సురేష్, కోశాధికారి ఎండీ ఖాజావలి, వల్లముల రామాంజనేయ సిద్ధాంతి, ఘంటసాల పెద్దిరాజు, ఎం.సూర్యనారాయణ యాదవ్, పచ్చ కృష్ణానందరావు, పుల్లాభొట్ల పురుషోత్తం, ఎంపీ సోమేశ్వరరావు, జిల్లెళ్ళమూడి వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కొట్లాటలో ఇరువర్గాలపై కేసులు నమోదు

ఆకివీడు: డ్వాక్రా సొమ్ము చెల్లింపులో ఇద్దరు సభ్యుల మధ్య వివాదం కొట్లాటకు దారితీసింది. వారిద్దరి ఫిర్యాదు మేరకు శుక్రవారం రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.నాగబాబు చెప్పారు. మండలంలోని చెరుకుమిల్లిలో డ్వాక్రా గ్రూపుకు చెందిన పడమటి రాజమ్మ, గ్రూపు లీడర్ పడమటి కనకదుర్గ డ్వాక్రా సొమ్ము చెల్లింపులో ఘర్షణ పడ్డారు. ప్రతి నెలా ఒక సభ్యురాలు బ్యాంకుకు సొమ్ము కడుతుంటారని, జూన్ నెల చెల్లింపు నిమిత్తం పడమటి రాజమ్మ బ్యాంకుకు కట్టాల్సి ఉండగా, తనకు సొమ్ము చెల్లించిన వారిలో కనకదుర్గ రూ.1000 తక్కువగా ఇచ్చారని అడగటంతో వారిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. తనపై కనకదుర్గ, మేకా శంకర్, నాగమణి, దాము రమేష్, దాము ఆదిలక్ష్మి, కట్టా రామలక్ష్మి దాడిచేసినట్లు ఫిర్యాదు చేశారు. రాజమ్మ ఇంటి వద్ద మందు అమ్ముతున్నారని అడిగినందుకు రాజమ్మ, భర్త గంగరాజు, కుమారుడు యేసు దుర్గాప్రసాద్, సతీష్‌లు మద్యం తాగి తన ఇంట్లోకి వచ్చి కొట్టినట్లు కనకదుర్గ ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

దివ్యాంగుల సంరక్షణకు కృషిచేయాలి

ఏలూరు (టూటౌన్) : మానసిక దివ్యాంగుల సంరక్షణకు నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. స్థానిక హనుమాన్ జంక్షన్ సమీపంలోని ఆశాజ్యోతి మానసిక వికలాంగుల కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. బాలబాలికలకు అందిస్తున్న వసతులు అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వ పథకాలు పొందటంలో, వారసత్వపు ఆస్తులు పైన ఎలాంటి న్యాయ సహాయం కావాల్సినా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా అందజేస్తుందన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఏలూరు (టూటౌన్): రైలు ప్రమాదంలో శుక్రవారం ఒక వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పవరుపేట, వినాయకుడి గుడి వద్ద నివసించే యండమూరి అప్పారావు(41) ఏలూరు గన్‌బజార్ రైలు బ్రిడ్జి కింద పడి మృతి చెందాడు. మృత దేహాన్ని ప్రభుత్వాసుపత్రికి మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు.

క్లుప్తంగా

పౌష్టికాహారం అందజేత



పౌష్టికాహారం అందజేస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక 20వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో కూటమి నాయకులచే బాలింతలకు, గర్భిణులకు శుక్రవారం పౌష్టికాహారం అందజేశారు. బీజేపీ నాయకులు నరిశే సోమేశ్వరరావు, నాయకులు వర్తనపల్లి కాశీ, సోమరాజులు హాజరైయారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులతో పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోమశంకర్, నాగేంద్ర, శ్రీను, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాసవీ, లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



ఆర్‌ఎంపీ వైద్యుడిని సత్కరిస్తున్న దృశ్యం

కాళ్ల: వేంపాడు వాసవీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంచి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కోపల్లె గ్రామ ఉప సర్పంచ్ బూడి వెంకట పరాలు తెలిపారు. వేంపాడు వాసవీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కోపల్లె గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉప సర్పంచ్ ఆర్‌ఎంపీ వైద్యుడు బుడి వెంకట పరాలును సత్కరించారు. వైద్య వృత్తిలో ఆర్‌ఎంపీల సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కందగట్ల మురళీకృష్ణ, సెక్రెటరీ మధుల నాగరాజు, ట్రెజరర్ నాలం గుప్తా, వాసవి క్లబ్ మెంబర్స్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నందమూరు గరువులో డ్రై డే నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: ప్రజల ఆరోగ్యం పట్ల, ఆరోగ్య సిబ్బంది ప్రత్యేకశ్రద్ధ కనబరచాలని డీఎంహెచ్‌వో మహేశ్వరరావు తెలిపారు. వీరవాసరం మండలం నందమూరు గరువులో నిర్వహిస్తున్న డ్రైడే.. ఫ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా శుక్రవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరూ తమవంతు బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కొబ్బరి డొక్కలు, ట్రాక్టర్ టైర్లు, రుబ్బురోళ్లు, ఖాళీ సీసాలో నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య పద్ధతులపై ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దేవదాసు, జి.జగమని, పి.చిట్టిబాబు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరణలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

కాళ్ల: రాష్ట్ర విద్యాశాఖ సూచించిన ఫార్మాట్‌లో రూపొందించిన డైరీని మూడు సంవత్సరాలుగా అందిస్తున్న కాళ్ల మండల యూటీఎఫ్ శాఖకు గోపిమూర్తి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా యూటీఎఫ్ కార్యాలయం భీమవరంలో కాళ్ల మండల శాఖ ఆధ్వర్యంలో దివంగత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి జ్ఞాపకార్థం రూపొందించిన ఉపాధ్యాయ డైరీ ఆవిష్కరణ సభ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఉపయోగపడే కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. సీహెచ్ పట్టాభి రామయ్య, జి.రామకృష్ణంరాజు, బీఆర్‌ఎంకే స్వామి, ఎం.శంకర్రావు, బీబీ మణి పాల్గొన్నారు.

వైభవంగా గ్రామ దేవతల జాతర

వీరవాసరం: రాయకుదురు గ్రామ దేవతలైన శ్రీ మావుళ్లమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, పోతురాజుస్వామి ఆషాఢ మాస జాతర మహోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. మేళ, తాళాలతో బాణసంచా కాల్పుల మధ్య గరగోత్సవం అత్యంత వేడుకగా చేపట్టారు. బుట్ట బొమ్మలు, తీన్మార్ నృత్యాలు, సినీ ఆర్కెస్ట్రాలతో జాతర కొనసాగింది. చలిమిడి, వడపప్పు, అన్నం, పానకాలతో మహా నైవేద్యం సమర్పించారు. విద్యుత్ దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కొండవీటి రామచంద్రరావు, ఆలయ ప్రధానార్చకులు నాయుడు వెంకటేష్, ఏలూరి సూర్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధూమపానం, ఆల్కహాల్ మానండిలా

- చెడు వ్యసనాలకు చెక్
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత మందులు
- సత్ఫలితాలిస్తున్న మందులు
- మందులకోసం తాపత్రయపడుతున్న వైనం
- వాసనే గిట్టడం లేదంటున్న బాధితులు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాయిబాలాజీ



తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న సాధు

తణుకు అర్బన్: ఫ్యాషన్‌గా మొదలుపెడుతున్న దురలవాట్లు యువత భవితను చిదిమేస్తుండడం, ఆ మత్తులో నేరాలకు పాల్పడుతున్న ఘటనలు నిత్యం కనిపిస్తున్నాయి. మాదకద్రవ్యాలు, ఆల్కహాల్‌కు బానిసలై కుటుంబాలు చిన్నాభిన్నం అయిపోతున్నాయి. ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాల్లో ఈ దురలవాట్లు వారి జీవనవిధానంపై ఎంతో దుష్ప్రభావం చూపిస్తోంది. ఒకవైపు ఆరోగ్యం పాడైపోతుండడమే కాకుండా దురలవాట్ల కారణంగా ఆర్థిక ఇబ్బందులు, మత్తు కారణంగా అపస్మారక పరిస్థితుల్లో వివిధ నేరాలకు పాల్పడే పరిస్థితి తలెత్తింది. అయితే మాదకద్రవ్యాలైన చుట్ట, బీడీ, సిగరెట్‌తోపాటు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలతోపాటు ఆల్కహాల్ సేవించడం వంటి వ్యసనాల నుంచి దూరం అవ్వాలనుకునే వారి కోసం ప్రభుత్వం మంచి మందులు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఖరీదైన మందులే అయినప్పటికీ ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని విధంగా మందులు రూపొందించబడ్డాయి. 2021లోనే ఈ మందులు అందుబాటులోకి వచ్చినప్పటికీ ఈ మందులు వలన ఎటువంటి ఇబ్బందులు వస్తాయోనని కొందరు, ధైర్యం చేయలేక మరి కొందరు వాడేందుకు విముఖత చూపించారు. కానీ గత ప్రభుత్వ హయాంలో పలు అవగాహన కార్యక్రమాలతోపాటు వివిధ కారణాలతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరే వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా మందుల వాడకానికి బాధితులు ముందుకు వస్తున్నారు.

జిల్లాలో తణుకు, తాడేపల్లిగూడెం ఆస్పత్రుల్లో..

నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా నేషనల్ టుబాకో కంట్రోల్ (ఎన్‌టీసీ)ప్రోగ్రామ్ ద్వారా మాదకద్రవ్యాల అలవాట్ల నియంత్రణకు ఈ మందులు సద్వినియోగపడుతున్నాయి. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారికి వారు ఎంతమేరకు వినియోగిస్తున్నారో తెలుసుకుని వారి ఆరోగ్య స్థితిని బేరీజు వేసుకుని వైద్యులు వివిధ పరిమితుల్లో మందులు అందిస్తున్నారు. వీటిని రెండు రకాలుగా అందుబాటులోకి తీసుకువచ్చారు. నికోటిన్ ప్యాచస్ (స్టిక్కర్ రూపంలో) 7ఎంజీ, 14ఎంజీ, 21ఎంజీ రూపంలో చేతి భుజానికి స్టిక్కర్‌గా అతికించే విధానంలో అందిస్తున్నారు. నికోటిన్ గమ్స్ రూపంలో పంటి కింద పెట్టుకునేలా 2ఎంజీ, 4ఎంజీ మోతాదులో అందిస్తున్నారు. ఇక ఆల్కహాల్ బాధితులకుకూడా వారు ఆల్కహాల్ సేవించే పరిమితి, వారి ఆరోగ్యస్థితిని బట్టి మందుల రూపంలో నెల నుంచి 3 నెలల కోర్సుగా మందులు వాడిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోను, తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రిలోను ఈ మందులు అందుబాటులో ఉంచారు. మాదకద్రవ్యాలు, ఆల్కహాల్ మానేసేందుకు సిద్ధపడినవారికి ఆస్పత్రుల్లో వైద్యులు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తుండగా, ఆస్పత్రిలో అందుబాటులోఉన్న నేషనల్ టుబాకో కంట్రోల్ ప్రోగ్రామ్ ప్రతినిధులు ఇన్‌పేషెంట్స్‌ను కలిసి కౌన్సెలింగ్‌తోపాటు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సబ్ జైల్స్‌లోను సమావేశాలు నిర్వహించి మాదకద్రవ్యాల నియంత్రణకు అవగాహన కల్పిస్తున్నారు.



మాదకద్రవ్యాల బాధితులకు వినియోగించే మందులు

ప్రస్తుతం 2వేల మందికిపైగా..

తణుకు, తాడేపల్లిగూడెం ఆస్పత్రుల్లో ప్రస్తుతం 2వేలకు పైగా మందులు వాడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. మాదకద్రవ్యాలు, ఆల్కహాల్ నియంత్రణకు చేస్తున్న కృషిలో భాగంగా బాధితులు తాము మానేసేందుకు సిద్ధంగా ఉన్నామని వస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతున్నట్లుగా తెలుస్తోంది. మందులు వాడే విధానంపై ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చి మందులను వారికి అందజేస్తున్నారు.

మందులు వాడితే ఆ వాసనే గిట్టదు



ధూమపానం, మాదకద్రవ్యాలు, ఆల్కహాల్ వంటి మత్తు నుంచి బయట పడాలనుకునేవారికి నేడు ప్రభుత్వ ఆస్పత్రిలో మంచి మందులు అందుబాటులోకి వచ్చాయి. మానేసేందుకు సిద్ధపడిన వారు ఎటువంటి అపోహలకు తావులేకుండా వస్తే ప్రత్యేక కౌన్సెలింగ్ ద్వారా 1 నుంచి 3నెలలు కోర్సుగా మందులు వాడిస్తున్నాం. వాడిన వారందరిలో మంచి ఫలితాలు వస్తున్నాయి. మరలా వ్యసనాలకు వెళ్లకుండా ఆ వాసనే కిట్టని పరిస్థితి వస్తుంది.

– డాక్టర్ ఎల్ సాయిబాలాజీ, మానసిక వైద్యనిపుణులు, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

అవగాహన కలిగిస్తున్నాం



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సేఫ్ కేర్ సెంటర్‌లో మందులు వాడుతున్న హెచ్‌ఐవీ బాధితుల్లో సిగరెట్, ఆల్కహాల్ సేవించేవారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. హెచ్‌ఐవీ బారినపడిన వారిలో వ్యాధి నిరోధక శక్తి క్షీణించే పరిస్థితి ఉంటుంది. అందువలన వారిలో ఉన్న దురలవాట్లు మాన్పిస్తే ఆరోగ్యం నిలకడగా ఉంటుంది. క్రమం తప్పకుండా మందులు వాడుతూ ఆల్కహాల్ వంటి మత్తుకు దూరంగా ఉంటే జీవనకాలం పెరుగుతుందని తెలుపుతున్నాం.

– డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, సేఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారి

కౌన్సెలింగ్ ఇస్తున్నాం



మాదక ద్రవ్యాలు, ఆల్కహాల్ బారిన పడిన వారి ఆరోగ్యస్థితి క్రమేపి క్షీణించే పరిస్థితి ఉంటుంది. వాటిని వదులుకుంటే తిరిగి వారి ఆరోగ్యస్థితి మెరుగుపడుతుంది. ముఖ్యంగా సిగరెట్, బీడీ, చుట్ట, గంజాయితోపాటు ఆల్కహాల్‌ను మానేసేందుకు సిద్ధపడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి మందులు పెడుతున్నాం. మందులు వాడుతున్న వారిలో మంచి ఫలితాలు వస్తున్నాయి. ఉన్నతాధికారుల సూచనల మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మందుల విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాం.

– జి.సాధు, ఎన్‌టీసీ, సోషల్ వర్కర్, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

కొత్త క్రిమినల్ చట్టాలపై న్యాయవాదుల నిరసన



తణుకులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తణుకు అర్బన్: ప్రభుత్వాన్ని విమర్శిస్తే దేశద్రోహంగా క్రిమినల్ కేసులు నమోదు చేసే విధంగా కొత్త క్రిమినల్ చట్టాలు రూపొందించబడ్డాయని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి విమర్శించారు. శుక్రవారం తణుకు బార్ అసోసియేషన్ భవనం వద్ద ఆల్ ఇండియా లాయర్ యూనియన్ ఆధ్వర్యంలో కొత్త క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కరోనా సమయంలో ఎటువంటి చర్చ నిర్వహించకుండా పార్లమెంట్‌లోని 140 మంది ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసి క్రిమినల్ చట్టాలను ఆమోదింపచేసిందని దుయ్యబట్టారు. పౌర హక్కులకు భంగం కలిగే విధంగా ఉన్న కొత్త క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో న్యాయవాదులు ప్రజాక్షేత్రంలో ప్రజల సహకారంతో పోరాటాలు చేయడమే మార్గంగా ఎంచుకోవాల్సి వస్తుందని అన్నారు. అనంతరం కొత్త క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నాయకులు కౌరు వెంకటేశ్వర్లు, న్యాయవాదులు బీవీవీ విక్టర్‌బాబు, పి.ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు నేడు వ్యాక్సినేషన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా ఈ నెల 6వ తేదీన శనివారం పట్టణ ప్రాంతీయ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు, వీధి కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.అనిల్ కుమార్ వెల్లడించారు. కుక్కల పెంపకందారులు తమ పెంపుడు కుక్కలను తీసుకువచ్చి వ్యాక్సిన్ వేయించాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తణుకులో కరపత్రాలు అందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: జ్వరం, కీళ్లు, కండరాల నొప్పులకు సొంత వైద్యం చేసుకోకుండా వైద్యులను సంప్రదించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని టి.వేమవరంలో శుక్రవారం నిర్వహించిన మలేరియా వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా డ్రైడే ఫ్రైడేతోపాటు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు చేతుల శుభ్రత పాటించాలని కోరారు. ఆహార పదార్థాలపై మూతలు ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ముఖ్యంగా దోమల వ్యాప్తి నివారణ ద్వారానే సకల రోగాలను నియంత్రించుకోవచ్చని తెలిపారు. వర్షాకాలం సందర్భంగా వచ్చే సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండాలంటే తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా జాగ్రత్తలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సెక్రటరీలు, హెల్త్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

సాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలి



తణుకులో ఇరిగేషన్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు అర్బన్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాగునీటి సరఫరా విషయంలో రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు నియోజకవర్గ ఇరిగేషన్ డిపార్టుమెంట్‌కు సంబంధించి కాలువలు, డ్రెయినేజీల అధికార యంత్రాంగంతో శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా కాలువలు, డ్రెయిన్‌లలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్కలను త్వరితగతిన తొలగించాలని ఆదేశించారు. వర్షాకాలం కాలం సందర్భంగా రాబోయే వర్షాలను దృష్టిలో పెట్టుకుని కాలువగట్లను పటిష్టం చేయడంతో పాటు డ్రెయినేజీల ఇన్‌లెట్ తలుపుల మరమ్మతుల పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అధికారులు డీ2 దక్షిణామూర్తి, ఈఈ కిషోర్, డీఈఈలు కె.శ్రీనివాస్, వరప్రసాద్, ఏఈలు అనిల్ బాలమురళి హరికృష్ణ, వివేక్ సత్యనారాయణ, జయశంకర్ పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సుకు పనిచేయాలి

ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



పడాల మార్కెట్ యార్డును తనిఖీ చేసిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: మార్కెట్ కమిటీ సిబ్బంది రైతుల శ్రేయస్సు కోసం పనిచేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని పడాల మార్కెట్ యార్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎంసీ కార్యదర్శి ఎంఎస్‌వీ.ప్రభాకరరావును చెక్ పోస్టుల ద్వారా శిస్తు వసూళ్లు, అభివృద్ధిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఏడాదికి రూ.2కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.10 కోట్లతో లింక్ రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. అవసరమైతే మరికొంత నిధులు సీఎం చంద్రబాబును అడిగి మంజూరు చేయిస్తామన్నారు. అధికారులు, సిబ్బంది అంతా రైతు శ్రేయస్సు కోసం పనిచేయాలన్నారు. అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. మార్కెట్ కమిటీని ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, అవకతవకలు బయటపడితే ఇంటికి వెళ్లిపోక తప్పదని సున్నితంగా హెచ్చరించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ఆయన వెంట ఏఎంసీ గ్రేడ్–1 కార్యదర్శి ఎంఎస్‌వీ.ప్రభాకర్, కూటమి నాయకులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఏరియా తాపీ, వడ్రంగి, సెంటరింగ్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను కలిసి భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్, పడాల శ్రీనివాస్, అత్తిలి బాబి, కోడే సాయి బాలాజీ, పోలిరాతి ఆదినారాయణ, అంకం భాస్కరరావు, శెట్టి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

బలుసులమ్మకు ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. బలుసులమ్మ ఆలయం వద్ద ప్రతి శుక్రవారం నిర్వహించే అన్నసమారాధనను శ్రీనివాస్ ప్రారంభించారు. అన్నసమారాధనకు సహకరించిన దాతలను అభినందించారు. ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

ఆకివీడు: పరిసరాల పరిశుభ్రతతో దోమల వల్ల వచ్చే వ్యాధులను అరికట్టొచ్చని మండలంలోని పెదకాపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ రాజశేఖర్ అన్నారు. కాళింగగూడెంలో శుక్రవారం డెంగీ ప్రబలకుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకుడు గుంతలు, మురుగు కుంతలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాలు, ఖాళీ కొబ్బరి బొండాలలో దోమలు దాగి ఉంటాయన్నారు. వీటి వలన డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. వర్షాకాలంలో ఇటువంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. నీటి నిల్వలపై మూతలు వేయాలన్నారు. మురుగు గుంతలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం విజయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు రోటరీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

తణుకు టౌన్: తణుకు రోటరీ క్లబ్ 2024–25 సంవత్సరానికి సంబంధించిన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు జీ సుధాకర్ చెప్పారు. శనివారం సాయంత్రం తణుకులోని రోటరీ హాల్‌లో జరిగే కార్యక్రమంలో రోటరీ నూతన అధ్యక్షుడు ఆనందం మస్తాన్‌రావు(బాబీ), కార్యదర్శిగా కఠారి సిద్ధార్థలు ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. తణుకు రోటరీ నూతన కార్యవర్గంతో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయిస్తారని చెప్పారు. ఈకార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ ఆపరేషనల్ మేనేజర్ ఎం దినేష్ కుమార్, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణలు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

క్రికెట్ అభిమానుల ర్యాలీ



క్రికెటర్లకు అభినందనలు తెలుపుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): వెస్ట్ ఇండీస్‌లో జరిగిన టీ–20 క్రికెట్‌లో ప్రపంచ చాంపియన్‌గా విజయం సాధించిన భారత టీంపై హర్షాతిరేకాలు తెలియజేస్తూ శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనురాధ మాట్లాడుతూ 17 ఏళ్ల తరువాత టీ–20 వరల్డ్ కప్ ఫైనల్స్‌లో భారత్ విజయం సాధించడం సంతోషదాయకమని, 2007లో ధోని సారథ్యంలోను, 2024లో రోహిత్ సారథ్యంలో విజయం సాధించామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలోనే ఎంతో ఉత్కంఠ భరితంగా సాగిన టీ–20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సౌత్ ఆఫ్రికాపై భారత్ ఘన విజయం సాధించింది. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం మాట్లాడుతూ క్రికెట్ ప్రపంచ కప్‌లో భారత దేశానికి గర్వించదగ్గ గొప్ప విజయమని, మన భారత ప్లేయర్స్ కృషి అద్వితీయమన్నారు. కార్యక్రమంలో పట్టణ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, బార్ చాంబర్ సభ్యులు ఉండపల్లి రమేష్ నాయుడు, కొండ్రు శ్రీనివాస్, ఏవో మావుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్స్ డేను జయప్రదం చేయండి

వీరవాసరం: ప్రభుత్వాలు మారుతున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గమని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అన్నారు. సీఐటీయూ అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 10న దేశ వ్యాప్తంగా డిమాండ్స్ డే నిర్వహిస్తారని, అందులో భాగంగా వీరవాసరం మండలంలో కూడా నిరసన కార్యక్రమం నిర్వహించాలని సీఐటీయూ మండల కమిటీ నిర్ణయించింది. ఈ సందర్భంగా శుక్రవారం కరపత్రాన్ని విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపై కాకుండా తన సొంత ప్రయోజనాల కోసం అధికారాన్ని వినియోగించుకొంటుందన్నారు. ఈ నేపథ్యంలో సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని విశాఖ ఉక్కును ప్రభుత్వమే నడపాలని, పలు డిమాండ్స్‌తో నిరసన చేపట్టామని తెలిపారు.

యూనిఫాం మెటీరియల్ పంపిణీ

ఆకివీడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలోని 52 పాఠశాలల్లో 4,430 మంది విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యూనిఫాం మెటీరియల్ అందజేశారు. అమ్మ ఒడి డబ్బులు ఎకౌంట్‌లో వేసే సందర్భంలో కుట్టుకూలి డబ్బులు కూడా జమ చేస్తారు. మండలంలోని అన్ని పాఠశాలలకు యూనిఫాంలు అందజేశామని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వాటిని విద్యార్థులకు అందజేస్తున్నారని ఎంఈవో ఎ.రవీంద్ర చెప్పారు. కాగా శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తోట పోతురాజు విద్యార్థులకు యూనిఫాం మెటీరియల్ అందజేశారు.

ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులు దూరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ముందుస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చని మలేరియా యూనిట్ జిల్లా సహాయ అధికారి పి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఫ్రై డే, డ్రై డే కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పరిశీలన, డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలపై అవగాహన, ర్యాలీ, సదస్సులు పట్టణంలో నిర్వహించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలానుగుణ వ్యాధుల పట్ల ప్రజలు ఎటువంటి ఆందోళన, అపోహలు వద్దని, అవగాహనతో వ్యవహరించాలని, అప్రమత్తంగా ఉండాలన్నారు. హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, జ్వరాలు వచ్చినప్పుడు దగ్గరిలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలలో పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాలని పలు సూచనలు చేశారు. ప్రత్యేక బృందాలు ఇంటింటా పరిశీలనలు, ఫీవర్ సర్వేలు చేశారు. వార్డు ఆరోగ్య కార్యకర్తలు జ్యోతి, ఆశా కార్యకర్తలు దేవి, దుర్గ, స్వాతి, ఆరోగ్య సహాయకులు కాంతారావు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రహదారి పనులు త్వరితగతిన చేపట్టండి

అత్తిలి: అత్తిలి నుంచి తణుకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో కె సముద్రపుగట్టు నుంచి గవర్లపాలెం వరకు రోడ్డు ఆధునికీకరణ పనులు త్వరితగతిన చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. బీటీ రోడ్డు నిర్మాణం కోసం గతంలో రోడ్డును జేసీబీతో తవ్వారని, దీనివల్ల ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి జారిపడుతున్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో ఈ రోడ్డు మార్గంలో ప్రయాణించే వారు నానా అగచాట్లు పడుతున్నారని దిరిశాల సత్యం సేవా సమితి అధ్యక్షుడు దిరిశాల మునేశ్వరరావు తెలిపారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి రహదారి ఆధునికీకరణ పనులు చేపట్టాలని ఆయన కోరారు.

అలంపురంలో 115 మందికి ఉచిత వైద్యపరీక్షలు

పెంటపాడు: అలంపురం వెంకటరమణచారిటీ ఉచిత ఆస్పత్రిలో శుక్రవారం 115 మంది రోగులు పరీక్షలు నిర్వహించినట్లు ట్రస్టు ప్రతినిధి కృష్ణంరాజు తెలిపారు. జనరల్ వైద్య పరీక్షలు –46 మంది, ఫిజియోథెరఫీ–33, దంతపరీక్షలు–7, కంటిపరీక్షల చేయించుకొని నిడదవోలు ఆస్పత్రికి శస్త్రచికిత్సల కోసం మరో 25 మంది రిఫర్ చేసినట్లు ఆయన తెలిపారు. శని, ఆదివారాల్లో ఆస్పత్రిలో ఉచిత కంటి పరీక్షలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ కంటివైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. ఆస్పత్రి ఆధ్వర్యంలో అవసరమైనవారికి రాయితీపై కళ్లజోళ్లు అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.